# మనవి

## సద్ధర్మ సంస్థాపనకు సద్భావ జల కుంభాభిషేకం

పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గురుదేవులు తమ తపోశక్తితో ఎల్లెడలా వెదజల్లిన సాయిభక్తి బీజాలు సమాజంలో అంకురించి 3 పారాయణలు, ఆరు సత్సంగాలుగా పరిఢవిల్లి శిరిడీ వీధులన్నీ సాయిభక్తుల జయజయ ధ్వానాలతో మారుమ్రోగుతూ పల్లెపల్లెల్లో సాయి మందిరాలు వెలుస్తూ సామాజిక స్థాయిలో సాయిభక్తి అద్భుతంగా పంట పండుతున్నది. దీని కంతటికి కేంద్ర బిందువుగా మాష్టర్‌గారు ఎన్నుకున్న మొట్ట మొదటి సత్సంగ కేంద్రంగా విద్యానగర్ తపోక్షేత్రం కావటం, (ఆచార్యులు) మాష్టర్ సల్పిన కృషిలో మనమందరం భాగస్వాములవటం కరుణాలయ శ్రీసాయి కృపా విశేషమే! మాష్టర్‌గారు ఆశించినది ఇంతేనా? ఇంకేమైనా వుందా? సాయిభక్తి సామాజిక స్థాయిలో పైకి వుంటే సరిపోతుందా? శ్రీసాయి తాము చెప్పినవీ, శ్రీమాష్టరుగారి ఆచరణ వాక్కుల ద్వారా చెప్పించినవీ, ప్రజల హృదయాంతరాలలో స్థానం ఏర్పరచుకొన్నవీ ఐన ఎన్నో సూత్రాలు అవగాహన సాధనల సాన బట్టకనే హృదయశుద్ధి కలుగుతుందా? అదిలేక తృప్తి శాంతులు ప్రతి ఒక్కరూ ఎలా పొందగలరు? ఇలా... ఇంకా ఎన్నో ఆధ్యాత్మిక సాధనా రహస్యాలను తమ తమ అనుభూతులను వ్యక్తం చేసుకొనుటకు విద్యానగర్ శిరిడీసాయి మందిర తృతీయ కుంభాభిషేకం గురు బంధువులందరికీ స్వాగతం పలుకుతుంది. తరలిరండి! తనివిదీరా సాయిమాష్టర్ సంగతులను ఆస్వాదించండి. అందరిలోనూ హృదయస్థులైన సాయీశునికి సద్భావాలనే జలంతో కుంభాభిషేకం చేయుటకు విచ్చేయండి!

**శ్లో॥ సదాకల్ప వృక్[illegible]స్యాధిమూలే భవద్భావ బుధ్యా సపర్యాధి సేవాం!**
**వృణాం కుర్వ[illegible]క్తి ముక్తి ప్రదంతం నమామీశ్వరం సద్గురుం సాయినాథం!**


26 సం॥ సాయి కరుణలో సునాయాసంగా గడచి పోయాయి. శ్రీ భరద్వాజ మాస్టరుగారి సాయిభక్తి పూచిన మొదటి మానస కుసుమం విద్యానగర్‌లోని సాయి మందిరం. శ్రీ వెంకయ్యస్వామి, రంగన్న బాబు, నారాయణ మహరాజ్, గులాబ్ బాబా, రామిరెడ్డి తాత, కేశవయ్య స్వామి, కృష్ణమాచార్యుల వంటి అవధూతలు, సాధు సత్పురుషుల పాదస్పర్శతో

పునీతమైన నేలలో భక్త కృషీవలుడైన శ్రీ మాస్టరుగారు లోకానికందించిన ఆధ్యాత్మిక సాధనా క్షేత్రమైన సాయి కరుణాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకం జరిగి పుష్కరకాలం పూర్తయినందున మరలా ఆ సంబరాన్ని మనమందరం సంతోషంగా జరుపుకొనే సందర్భాన్ని పురస్కరించుకొని యావన్మందికీ శిరిడీ సాయి కల్చరల్ మిషన్, విద్యానగర్‌వారు పలుకుతున్న శుభాహ్వానమిది.

తృతీయ కుంభాభిషేక కార్యక్రమాలు త్రయాహ్నిక దీక్షతో మే మాసం 7,8 మరియు 9 తేదీలలో జరుపునట్లు ఆగమవేత్తలు సుముహూర్తం నిర్ణయించినారు. అందరూ సాదర భక్తి పూర్వకంగా ఆహ్వానితులు.

ఈ సందర్భంలో మన సాయి మందిరం గూర్చి చిన్న .. రూపంలో తయారు చేయాలని సంకల్పం కలగడంతో దానికి ప్రస్తుతానికి ఈ రూపం వచ్చింది. ఇది సవినయంగా సమర్పిస్తున్నాం.

S.S.C.M. విద్యానగర్.



శిరిడి సాయి పాదుకలు



# కరుణాలయం


## శిరిడీ సాయి మందిరం, విద్యానగర్, నెల్లూరు జిల్లా.

దగ్గరలో ఉన్నట్టు కనిపిస్తూ కాస్త దూరంలో ఉండే కొండ; ఆ కొండ మీద శివాలయం; క్రింద ఒక ప్రక్క, చీలి రెండు పాయలై ప్రవహించే స్వర్ణముఖి; కొండ చరియలంతా కమ్ముకొని 'చిదిమిన పాల్గారు' అన్నట్టున్న బొంతజెముడు పొదలు, రకరకాల అడవి మొక్కలు; చల్ల చల్లగా సాగే గాలి తెరలు; ఈ ప్రకృతినంతా తడుపుతూన్న వెన్నెల, ఈ వాతావరణంలో ఎన్ని రాత్రులు గడిపారో శ్రీ భరద్వాజగారు. విద్యానగర్ కాలేజీలో Lecturer గా Select అయింతర్వాత, జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధి నుండి 1969, జులైలో ఇక్కడకు వచ్చి చేరిన శ్రీ భరద్వాజగారికి తనకలవాటైన సత్సంగ వాతావరణం ఇక్కడ లేని తేడా తెలిసింది. ఆ కొరతను తీర్చేవైన ఈ రాత్రి వెన్నెలలో కొండ చుట్టూ చిట్టడవులలో తనివి తీరా చేసిన ఈ ఒంటరి విహారాలే ఎంతో ఆహ్లాదాన్నిచ్చేవి. ఇక్కడకు రావడానికి ముందు ఎన్నోసార్లు తనకు రాత్రి కలల్లో–ఒక కొండ, దానిపై ఒక గుడిసె, అందులో ఒక ఇనపరాట, దాని నుండి బయటకు వచ్చిన ఇనపగొలుసు, దాని రెండవకొస తన కాలికి సంకెలలా బిగిసి ఉండడం – తరచూ కనిపించేది. ఇక్కడికి Interview కై వచ్చినపుడు ఆ కొండ, ఆలయం చూడగానే ఆ కల గుర్తొచ్చిందని చెప్పేవారాయన. అలా మొదలైంది శ్రీ భరద్వాజ మాస్టారుగారి విద్యానగర్ ప్రస్థానం.

కొద్ది కాలంలోనే ఆ మాస్టారుగారు మనసులో శిరిడీ సాయినాధునికి ఇలా చెప్పుకొన్నారట: సాయా! ఇక్కడే సత్సంగం ఏర్పాటు చేసినా సరే లేదా సత్సంగమున్న చోటకు నన్ను చేర్చినా సరే–అని. బాబా సరేననుకొనడం విద్యానగర్ వాసులు చేసుకొన్న గొప్ప అదృష్టం. ఆయనే కల్పించారేమో మరి – ఒక విద్యార్థి మాస్టారి వేలికున్న బాబా ఉంగరం చూచి – ఎపుడో చనిపోయిన వ్యక్తి రూపాన్ని ఇలా పూజించడం అర్థం లేని పని గదా – అంటూ ప్రారంభించిన ప్రశ్న రోజులు గడిచే కొలదీ ఎన్నో విషయాలను గూర్చిన చర్చ క్రిందికి మారింది. మనిషి, జీవితం, ప్రకృతి, సృష్టి, పుట్టుక ఇలా ఎన్నో విషయాలు చర్చకు వచ్చాయి.

ఇలా కొందరు విద్యార్థులు ఆ చర్చల్లో పాల్గొనడం, రకరకాల ప్రశ్నలు అడగడం, సమాధానాలు పొందడం అనే పద్ధతుల్లో కొనసాగుతూ వచ్చిన ఆ

చర్చలు సత్సంగ రూపాన్ని పొందేటప్పటికే మాస్టరుగారు ఇప్పుడు తపోవనంగా పిలవబడే ఇంటిలో అద్దెకు దిగారు. విద్యార్థులు కొందరు అడిగిన మీదట గురువారాల్లో మహాత్ముల చరిత్ర పారాయణ, భజన, సత్సంగ కార్యక్రమంగా జరుగుతూ వచ్చింది. కొద్ది కాలానికే అది మాత్రమే కాక ప్రతిరోజు సాయంకాల సమయాలలో మహాత్ముల చరిత్రలు, బోధలు, బైబిల్, ఖురాన్, వాశిష్ట రామాయణం, దాసబోధ మొదలైన ఎన్నో గ్రంథాలు చదువుతూ వివరిస్తూ తర్కిస్తూ అక్కడ బోధించబడ్డాయి.వీటికి వచ్చే విద్యార్థుల కుటుంబ సభ్యులు, ఆయా ఊర్లకు సంబంధించిన మరి కొందరు గురువారం సత్సంగాలకు వచ్చేవారు. అలా ఆ కార్యక్రమం 1970 నుండి 12 సంవత్సరాలకు పైగా నిరాఘాటంగా అక్కడే కొనసాగింది. సత్సంగ సభ్యులను ఆశీర్వదించడానికి అక్కడికి ఎందరో మహాత్ములు వచ్చారు.



మాష్టరు సత్సంగ గది

ఇన్నేళ్ళుగా అక్కడ నిరంతరాయంగా సత్సంగం జరగడానికీ, అక్కడికి మహాత్ములు వేంచేస్తుండడానికీగల కారణం ప్రక్క గ్రామానికి చెందిన శ్రీ మస్తాన్‌రెడ్డి (కరీమ్‌బాబా)గారి ద్వారా తర్వాత తెలిసింది. ఆచార్యులవారు పనిచేస్తున్న కళాశాల ఏర్పడక మునుపు కొన్ని సం॥లకు పూర్వం గూడూరు బస్‌స్టాండ్‌లో ఉన్మత్తావస్థలోనున్న ఒక ముస్లిం మహాత్ముడు వచ్చారట. ఆయనప్పుడప్పుడూ కాలినడకన విద్యానగర్ మీదుగా పై గ్రామాలకు వెళ్ళి వచ్చేవారట. ఎప్పుడట్లా ఆయన విద్యానగర్ మీదుగా సాగిపోయినా ఇప్పుడు సత్సంగం జరుగుతున్న యిల్లు కట్టబడిన ఖాళీ స్థలంలో ప్రత్యేకించి కొంతసేపు కూర్చొని వెళ్ళేవారట. అలా ప్రతిసారి ఆయన అక్కడే కూర్చొనడంచూచి శ్రీ మస్తాన్‌రెడ్డిగారు "ఏమా ఈ స్థల మహత్యం?" అనుకునేవారట. కొద్ది సం॥ల తర్వాత శ్రీ ఆచార్యుల వారుంటున్న యిల్లు, సరిగ్గా వారు కూర్చొనే జాగాలోనే మా సత్సంగ మందిరమైన పెద్దగది నిర్మించబడి మరికొద్ది కాలంలో సత్సంగం ప్రారంభమవడమూ జరిగిందట! అంపుకే కాబోలు తర్వాత శ్రీ రంగన్న బాబుగారు, శ్రీ నారాయణ మహరాజ్‌గారూ, ఆ స్థలాన్ని పాలనం చేయడం కూడ జరిగింది. ఏ ప్రదేశంలో అయితే ఆత్మజ్ఞాని అవు నుండి పాలు పితికేంత



సేపైనా కూర్చొంటారో ఆ ప్రదేశం పరమ పవిత్రమవుతుందని శాస్త్రంకూడాను. అందుకే శ్రీ రంగన్నబాబు గారితో శ్రీ కోదండరామస్వామి అక్కడ గొప్ప మందిరమూ, ఆశ్రమమూ ఏర్పడతాయనీ, యజ్ఞ యాగాదులు జరుగుతాయనీ, ఆ మందిరాన్నెందరో సిద్ధపురుషులు దర్శించి పావనం చేస్తుంటారని చెప్పారు.

తర్వాత సమర్థ రామదాసస్వామి సాంప్రదాయానికి చెందిన పీఠాధిపతి శ్రీ సమర్థ నారాయణ మహరాజ్ అనే సిద్ధపురుషులు విద్యానగర్ వచ్చి శ్రీ రంగన్న బాబుగారు చెప్పిన మాటలేచెప్పి శ్రీ ఆచార్యులవారిని మందిర నిర్మాణానికి పూనుకోమనీ, ఆయన పూనుకొంటే ఆ మహత్కార్యం తేలికగా జరిగిపోతుందనీ అన్నారు. అందుకు శ్రీ ఆచార్యులవారు, 'ఈ ప్రాంతం వారికి మందిరం కావాలన్న అభిలాష కలిగితే, అలా వారికి శ్రద్ధ కలగడమే సాయి సందేశంగా తీసుకుంటా'నని చెప్పారు.

కొద్ది నెలలు గడిచేసరికి స్థానికులైన పెద్దలు కొందరొచ్చి, మూడు వేరువేరు స్థలాలను విరాళ మొసగడానికి ముందుకు వచ్చి, వారివారి స్థలాలలో మందిరం నిర్మించవలసినదిగా కోరారు. శ్రీ ఆచార్యులవారు సంకల్పించిన నిదర్శనం లభించింది. అప్పుడే ఒక సోదరుడు శ్రీశైలం వెళ్తుంటే శ్రీ పూర్ణానందస్వామి వారికి యీ మూడు స్థలాల గురించీ వ్రాసి రానున్న మందిరానికీ, ఈ ప్రాంతానికీ శ్రేయస్కరమైన ప్రదేశాన్ని నిర్ణయించి తెలుపమని శ్రీ ఆచార్యులవారు కబురు చేశారు. వారి సమాధానం అందేలోగా విద్యానగర్ సత్సంగ బృందాన్ని సమావేశపరచి సాయి తమ అభిప్రాయాన్ని వారిద్వారా తెలుపాలని ప్రార్థించారు. అందరూ ఒక భక్తుడిస్తానన్న 33 1/3 అంకణాల స్థలం నిర్ణయించారు. ఆశ్చర్యమేమంటే అదే కొన్ని సం॥లకు పూర్వం శ్రీ రంగన్న బాబుగారు చెప్పిన చోటు! ఆ మరురోజుకు అదేస్థలాన్ని నిర్ణయిస్తూ శ్రీ పూర్ణానందుల వద్దనుండి జాబువచ్చింది. మందిరం సాయి సంకల్పమని మరొక నిదర్శనం.

ఆ 33 1/3 అంకణాలకు తోడు మరో 100 అంకణాలు కొనాలని నిర్ణయించారు. కానీ, కొనడానికి పైకమెక్కడిది? విరాళ సేకరణ తర్వాతకదా స్థలాన్ని కొనగలిగేది! కానీ స్థలాన్ని వెంటనే రిజిస్టర్ చేయించుకోవలసి వచ్చింది. ఆ మరురోజే సాయి భక్తులైన స్థానిక వర్తకు లొకరు వచ్చి తననొక వ్యక్తి మోసగించి కొంతసొమ్ము తీసుకుపోయాడనీ, అతడాడబ్బు తిరిగిస్తే ఆ సొమ్ము స్థల సేకరణకు యిస్తాననీ చెప్పారు. చిత్రంగా మరుసటి ఉదయమే ఆ వర్తకుడు

మరలా వచ్చి సంతోషంగా పదహారు వందల రూపాయలు యిస్తూ, మోసం చేసి డబ్బు తీసుకువెళ్ళిన క్షణం నించి ఆందోళన ప్రారంభమైందనీ, తిరిగి ఆ పైకం తెచ్చేదాకా మనశ్శాంతి లేకుండా పోయిందనీ చెప్పి పైకమిచ్చి వెళ్ళాడని చెప్పారు. ఆ పైకంతోనే స్థలం కొనడం జరిగింది.

స్థలాన్ని రిజిష్టర్ చేసుకొన్న తర్వాత సత్సంగ సభ్యులైన చి॥ దామోదర్, విజయభాస్కర్‌లు శ్రీ ఆచార్యుల వారితో కలసి శిరిడీ వెళ్ళారు. వారు ముగ్వురూ ఉదయం 8 గం॥లకు ద్వారకామాయిలో ప్రవేశించే సరికి ధుని వెనుక పారాయణ చేసుకుంటున్న ముగ్గురుతప్ప మరెవరూ లేరు. క్రితం రాత్రి భక్తులు వేసిన పువ్వులూ, అక్షింతలూ తీసివేసి సంస్థానంవారు శుభ్రంగా తుడిచివుంచారు. శ్రీ ఆచార్యులవారు సాయి పాదుకలకు నమస్కరించి, "బాబా మీ ఆజ్ఞ ననుసరించి ఈ కార్యక్రమం చేపడుతున్నాను. నాకు స్థాన బలం, ధన బలం లేదు. మీదే భారం." అని సాయికి విన్నవించుకొని పటానికెదురుగా ధుని కానుకుని కూర్చున్నారు. తర్వాత విజయభాస్కర్ నమస్కరించుకుంటున్నాడు. రెప్పపాటులో బాబా పాదుకలపై రెండు పదిరూపాయల నోట్లు కన్పించాయి. చి॥ భాస్కర్, దామోదర్‌ల యిద్దరివద్దా పైకంలేదు. డబ్బంతా శ్రీ ఆచార్యులవారు జేబులో పెట్టుకుని అవి జారిపడి పోకుండా పైన స్వెట్టర్‌కూడ వేసుకున్నారు. అప్పటికి మరెవ్వరూ అక్కడకు రాలేదు. అక్కడివారుకూడా అవి తమవికావని చెప్పారు. వాటినలాగే తీసుకొచ్చి సాయి ప్రసాదంగా పూజలోవుంచారు.

తర్వాత గుంటూరులో శ్రీరంగన్నబాబుగారిని దర్శించి వారిమాటలెలా నెరవేరాయో విన్నవించి వారి ఆశీర్వచనం కోరారు శ్రీ భరద్వాజగారు. ఆ మాట వింటూనే శ్రీ రంగన్నబాబుగారు నిశ్చలంగా కొద్దిసేపు నుంచోని "కాళ్ళూ చేతులూ కడుక్కుని రాయ్యా, ప్రసాదమిస్తాను" అన్నారు. ఆ తర్వతాయన ఐదు రూపాయల ఒక పైస చేతిలో పెడ్తూ, "నేను నీళ్ళ కావిళ్ళుమోసి సంపాదించిన డబ్బులో రు.5-01 లు మందిరానికి రాములవారిమ్మన్నారు. ఇంత చిన్న విరాళమిచ్చాననుకోవద్దయ్యా, ప్రతి పైసలోనూ కావడి మోసిన శ్రమ, ఆ సమయంలో నే చేసిన రామనామం ఉన్నాయి." అన్నారు. ఈ ప్రసాదం కూడా వేరుగా భద్రపరచబడింది.

తర్వాత మద్రాసు వాస్తవ్యురాలు, తపస్విని అయిన శ్రీమతి రేవతమ్మగారి దర్శనార్థం సోదరుడు శ్రీ శేషాద్రి వెళుతుంటే అతనితో మందిరానికి అమ్మ



ఆశీస్సులర్థించమని చెప్పి పంపారు. అమ్మకు శ్రీ మీనాక్షీదేవి ప్రసన్నం. శేషాద్రిగారీ కబురు చెప్పగానే ఆమెలేచి మీనాక్షీదేవి విగ్రహం ముందు నిలచి కొద్ది నిమిషాలు ప్రార్థించివచ్చి రూ.116/-లు అతనికిస్తూ, "ఇది రేవతమ్మ ప్రసాదం కాదు. మీనాక్షీదేవి ప్రసాదమనిచెప్పు. అంతా బాగా జరుగుతుంది" అని అన్నారట.

తర్వాత శ్రీసాయి ఆజ్ఞ ననుసరించి చి॥ వేణుగోపాల్ అను సాధువు విద్యానగర్‌వచ్చి అక్కడ శ్రీ సాయిబాబా, శ్రీస్వామీ సమర్థులు,శ్రీ మాణిక్య ప్రభువుల చరిత్రలు శ్రీ గురుచరిత్ర పారాయణం చేశారు. ఒకరోజు ధ్యానంలో వుండగా శ్రీ లక్ష్మీదేవి ఆయనను మందిర స్థలానికెళ్ళమని చెప్పి అక్కడ అద్భుత రీతిన అక్షింతలు ప్రసాదించి స్థలం చుట్టూ చల్లమని చెప్పి మందిర నిర్మాణం విజయవంతమవుతుందని చెప్పారట.

**శ్రీ జి. సూర్యప్రకాశరావుగారు మందిర విషయంగా మాస్టారితో చేసిన చర్చ:**

నేను, మాస్టరుగారు కలసి మందిరానికి విరాళాలు సేకరించడానికై సమీపంలోని కొత్తపాళెం వెడుతూండగా ఈ కార్యక్రమం యొక్క ప్రయోజనాన్ని గూర్చి మాష్టరుగారిలా వివరించారు : "నిజానికి మనం నిర్మించే మందిరం బాబాకు అవసరం లేదు. మనకు లౌకికంగా అది అవసరం కాదు. కాని రాబోయే తరాల వారెందరికో ఎంతో ఉపకరించే ఈ కార్యక్రమాన్ని నిష్కామకర్మగా తలచి మనలోని చెడ్డ సంస్కారాలను తొలగించుకొని మన అంతరంగాన్ని శుద్ధం చేసుకోడానికి మనం చేపడుతున్నాము. ఎవరి జీవితం వారు జీవిస్తూ మనం విడిగా ఉన్నంత కాలం మనలో కొన్ని వాసనలు మరుగున ఉండిపోతాయి. ఇట్టి సామూహిక సత్కర్మ మనలను సన్నిహితం చేసి మన మధ్య ప్రేమపూరితమైన సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుతుంది. ఒక్కొక్కప్పుడు మనలో దాగిఉన్న అవాంఛనీయమైన సంస్కారాలు వెలికివచ్చి మనమధ్య భేదాభిప్రాయాలనూ, వైషమ్యాలను కలిగిస్తాయి. వాటి స్వంగీకరించి వాటికి లొంగిపోక వాటిని గుర్తించి మనమాశించిన లక్ష్యాన్ని గుర్తుంచుకొని యిట్టి వైషమ్యాల పట్టునుండి తప్పించుకోవడం నేర్చుకోవాలి. మనం చేపట్టిన కర్తవ్యానికి, మనం కోరిన హృదయ పారిశుద్ధ్యానికి మాత్రమే ప్రాధాన్యత నివ్వాలి. ఇలా చేస్తే మనలోని చెడ్డ సంస్కారాలు తొలగి మన హృదయం ఈ సత్కర్మతోను దాని లక్ష్యంతోను ఐక్యత చెందుతుంది. అంతరంగం ఆత్మ జ్యోతిని

ప్రతిబింబించగల శుద్ధమైన అద్దంలాగా తయారౌతుంది. అప్పుడు బాబాపట్ల మనకుగల భక్తి మనలను లక్ష్యానికి చేరుస్తుంది.

"అంతేకాక సామాజిక శ్రేయస్సుకోసం పనిచేసేటప్పుడు మనం కొందరిమన్ననలను, మరికొందరి దూషణలను కూడ ఎదుర్కోవలసి ఉంటుంది. అట్టి సత్కర్మ వలన ఆ రెండింటిపట్ల నిర్లిప్తుల మవడం, మనం సాధించదలచిన సంఘశ్రేయస్సూ, ఆత్మ పారిశుద్ధ్యాలకు మాత్రమే ప్రాముఖ్యత నివ్వడం నేర్చుకొంటాము. మనలోని ఇట్టి పరివర్తన పూర్తయ్యేసరికి మన హృదయమే నిజమైన సాయిమందిర మౌతుంది. అందులో బాబా తనను తానే ప్రతిష్టించుకుంటారు. మనం నిర్మించే బాహ్యమైన మందిరం అప్పుడే దానికి చక్కటి ప్రతిరూపమౌతుంది. మనలో ఇట్టి పరివర్తన కలిగించని మందిర నిర్మాణం నిజమైన ప్రేమలేని బాహ్య మర్యాదలవలే వ్యర్థమైన వంచనే ఔతుంది.

"విమర్శించే వారి మాటలు వారి ఆత్మ వంచనకు నిదర్శనం. వారికి పేదలమీద అంత సానుభూతే ఉంటే తాము దుస్తులు, ఆభరణాలు, టాయిలెట్, సినిమాలు, అధిక వ్యయంతో నిర్వహించే పెళ్ళిళ్ళకోసం ఖర్చుపెట్టే ధనాన్ని తగ్గించుకొని పేదలకు సహాయం చేయవచ్చుగదా! నిజానికి పేదలకు అన్న వస్త్రదానం చేయడం కంటే కూడ మనం చేస్తున్నదే మెరుగైన వినియోగం. పేదల కుచితంగా దానం చేస్తే వారిని సోమరులుగా తయారు చేసిన వారమౌతాము. మన దేశంలో బిచ్చగాండ్ల సమస్యగూర్చి మేధావులందరూ ఇట్టి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. కానీ మనం మందిరం నిర్మించేప్పుడు ఎందరో రాళ్ళు చెక్కే వారికి, కట్టుబడి చేసేవారికి, ఇతర కూలీలకూ పని కల్పించి ప్రతిఫలాన్ని ఇస్తున్నాము. సిమెంటు, ఇనుము మొదలగునవి కొన్నప్పుడు కూడా అందులో కొంత భాగం పైకం ఆయా కర్మాగారాలలో పనిచేసే వారికి చేరుతుంది. కానీ మనలను గుడ్డిగా విమర్శించే వీరంతా ఆడంబరాలకోసం ఖర్చుచేసేదంతా .. చేసే వారికీ,, స్వలాభం తప్ప మరొక దానిని పట్టించుకొనని వారికి చేరుతుంది. ఉదాహరణకు ప్రజలు సినిమాకు పోసే డబ్బంతా ధనికులైన నిర్మాతలకు చేరుతంది. వారా పైకంతో నిర్మించిన సినిమాలు విద్యార్థులను విద్యాలయాలనుండి పరారయ్యేలా చేస్తున్నాయి. సంఘ శ్రేయస్సుకు వ్యతిరేకమైన విశృంఖల భావాలకు బానిసలను చేస్తున్నాయి. అంటే ఇట్టి గుడ్డి విమర్శలు చేసేవారు సరైన అవగాహన, యోచన లేనివారని ఋజువౌతుంది. ఐతే అట్టివారి



విమర్శలు కూడ మనం చేసే సత్కర్మయొక్క విలువను గూర్చి యోచించి మరింత బాగా తెలుసుకోవడానికీ, సాధ్యమైతే వారికి తెలియ జెప్పడానికి పనికొస్తాయి. దీని విలువను మనం గుర్తించలేనపుడు వారి విమర్శలకు ఆవేశపడి మనవిశ్వాసానికి మూఢంగా అంటిపెట్టుకోవాల్సి వస్తుంది. అర్థం చేసుకొంటే అట్టి విమర్శకులపట్ల ఆగ్రహానికి బదులు వారి అజ్ఞానంపట్ల సానుభూతి కలుగుతుంది. మనమిట్టి సత్కర్మలు చేయడం యెంత అవశ్యకమో యింకా బాగా తెలుస్తుంది."

"ఇట్టి విమర్శకులు పేదలపట్ల ప్రదర్శించే సానుభూతి అసత్యమే కావచ్చు. మనమీసత్కర్మకు ధనం వెచ్చించడం వారు పెట్టే ఖర్చులకంటే మేలైన వినియోగమే కావచ్చుగాక, కానీ మనమూ ఈ పైకాన్నింకా సార్థకం చేయవచ్చేమో!" అన్నాన్నేను. దానికి మాష్టారు ఇలా అన్నారు, "మందిరం నిర్మించాక అక్కడ లాంఛనంగా నిత్య పూజలు చేయించడంతో మనం సంతృప్తిపడేట్లయితే నిజంగా మనం ధనాన్ని అత్యుత్తమ రీతిన వినియోగించనట్లే- ఈనాడు మందిరాలకు వెళ్ళేవారంతా యిహపర సంబంధమైన భీతివలన మాత్రమే వెళ్ళుతున్నారు. అలాకాక మనం వారికి బాబా చరిత్రను, ఉపదేశాలను శ్రవణం చేయించినట్లయితే ఆయనలో ప్రకటమైన అత్యుత్తమ నైతిక, ఆధ్యాత్మిక మానవతా విలువలపట్ల, ఆయనపట్ల, భక్తిగౌరవాలు కలుగుతాయి. ఎంతమేరకు బాబాయొక్క మహిమ వారి హృదయాలకు హత్తుకుంటుందో అంతమేరకు వారుకూడా తమ జీవితాలను సంస్కరించుకుంటారు. సాటివారిని సాయి రూపాలుగా దర్శించి సేవించ గలుగుతారు. గుడ్డిగా దేవాలయాలకు వెళ్ళేవారిని అధికారులను చూచి వెరచి పనిచేసే ఖైదీలతో పోల్చవచ్చు. సాయిచరిత్ర నెరిగి ఆయనపై భక్తి విశ్వాసాలతో మందిరానికి వచ్చేవారిని తన కుటుంబంపై ప్రేమతో సేవించే సహృదయములతో పోల్చవచ్చు. కనుక అట్టి సత్సంగం నిర్వహించని మందిరాలు మందిరాలేకావు; సాయి ఆచరించి చూపిన ఉత్తమ జీవిత విలువలు మన అంతరంగాలను కలవరపరచకుండా భూస్థాపితం చేసిన సమాధులనే చెప్పాలి. నిజమైన మందిరం ప్రతి భక్తుడి హృదయాన్ని దేవాలయంగా మార్చగలదు. ప్రతి సంవత్సరమూ కోట్లరూపాయలు వెచ్చించి మనం నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు చేయలేని పనిని నిజమైన మందిరం చేయగలదన్నమాట; సంఘంపట్ల బాధ్యతలేని చీడపురుగులగు వ్యక్తులుగా తీర్చిదిద్దడం కంటే ఈ విద్యాలయాలు చేస్తున్నదేమి?"

“వారలా తలచడానికి కారణం శాస్త్రజ్ఞులు అటుబ్రహ్మాండాల నుండి యిటు పరమాణు కేంద్రాల వరకూ చేసిన పరిశోధనలలో వారికి దైవమెక్కడా తారసిల్లక పోవడమే. అలా యెక్కడా గోచరించని దైవాన్ని విశ్వసించడం శాస్త్రీయ దృక్పధానికి ప్రమాదకరమని వారనుకొంటారు.

“నిజమైన దైవభక్తి శాస్త్రీయ దృక్పధాన్ని ప్రతిఘటించదు. అలా ప్రతిఘటించేది నిజమైన విశ్వాసంకాదు. సైన్సు నిరూపించని ప్రేమతత్త్వం, విజ్ఞానంపైగల ప్రేమ అనదగు శాస్త్రీయ కృషిని ప్రతిఘటించకపోగా దోహదం చెయ్యడంలేదూ? శాస్త్రీయదృష్టిని ప్రతిఘటించి భక్తి కేవలం యాంత్రికమైన సాంప్రదాయం కావడంవలన ఆత్మజ్ఞానమనే ఫలితాన్ని కూడా ఇవ్వజాలదు. ఆధ్మాత్మికత అంతా ప్రేమతత్త్వాన్ని పెంపొందించేదే గనుక అది శాస్త్రీయ జ్ఞానంపై కూడా ప్రేమను పెంపొందిస్తుంది. ఈ సంగతి తెలియక నేటి విజ్ఞానశాస్త్రంచేత నిరూపింపబడదని తలచి దైవభక్తిని శాస్త్రీయ దృక్పధం కలవారు నిరసింపజూడడం వలన, ఆ కారణంగానే ప్రేమను గూడా నిరసించడం జరుగుతుంది. శాస్త్రీయతా ప్రభావానికి గురైన నేటి మానవ జాతిలో పరస్పర ప్రేమ విశ్వాసాలు లోపించడం, సమాజంలో వ్యక్తులు ఒకరినొకరు దోచుకోవడం మానవజాతిని రూపుమాపగల మారణాయుధాలను పెంపొందించడం చూడవచ్చు. ప్రతికుటుంబంలోనూ వ్యక్తులు స్వార్ధంతో కలహించుకోవడం చూడవచ్చు. అంతేకాదు, నేటి శాస్త్రీయ విజ్ఞానం దైవమనే అతీతశక్తిని, చైతన్యాన్ని నిరూపించదని తలచడం సమంజసమో కాదో నేను వ్రాసిన “విజ్ఞాన వీచికల” వ్రాత ప్రతులలో చదివారు కదా! ప్రేమను పెంపొందించే క్రమశిక్షణే ఆధ్మాత్మికత. ప్రేమే దైవమని (God is Love) సత్యమనీ (God is Truth) ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. కనుక భక్తి విశ్వాసాలను ప్రచారం చేస్తే శాస్త్రీయ దృక్పధం సమాజానికి లోపిస్తుందని తలచుట అశాస్త్రీయము, ..కు కూడా వ్యతిరేకం.”)

కొద్ది నెలల తర్వాత సోదరుడు శ్రీ విజయకుమార్ ఒకవారం శ్రీ పూండీస్వామి సన్నిధిలో ధ్యానాధులు చేసుకొని వస్తూ మందిరం సంగతిచెప్పి ఆశీర్వచనం కోరి కొబ్బరికాయను సమర్పించాడు. వారు “మంచిది” అని ఆశీర్వదించి, ఆ కాయను అతనికిచ్చి బావి త్రవ్వేచోట కొట్టమని చెప్పారట! అలానే చేసారు. ఆ సంవత్సరం వేసవి తీవ్రతకు ఊరిలోని బావులన్నీ ఎండిపోయినా, మందిరంలోని బావి ఊరంతటికీ నీటినిచ్చింది. వివిధ భక్తులు



శ్రీ అవధూత వెంకయ్యస్వామి, శ్రీ కంచి శంకరాచార్యులవారు, సతీ అనసూయామాత (పొర్ధాసింగా), కాళహస్తిలో నివసించిన అవధూత స్వామి మొ॥న మహాత్ముల ఆశీర్వచనాలను తెచ్చారు.


బాబా దయవలన నిధులు లభించగానే మందిర ప్రమాణాన్ని నిర్ణయించవలసి వచ్చింది. ఒకరోజు సత్సంగ మందిరం డాబాపై నిద్రించిన కొత్తూరు సుబ్బరామయ్యశ్రేష్టి అనే భక్తునికి విద్యానగర్‌లో పెద్ద సాయిమందిరం నిర్మించబడివున్నట్లు, ఆ మందిరము చుట్టూ ఆయన ప్రదక్షిణం చేస్తున్నట్లూ దివ్య స్వప్నం వచ్చింది. వారామందిరపు ప్లానంతా గీచి చూపారు. ఆయన ఒక్కసారికూడా శిరిడీ దర్శించకపోయినా, ఆయన గీచిన ప్లాను శిరిడీ సమాధి మందిరాన్ని పోలివుండడం అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. అదే సాయి సందేశంగా యెంచి శిరిడీవెళ్ళి సమాధి మందిరపు కొలతలు తీసుకువచ్చాము.



శంఖువును పూజిస్తున్న మాస్టరు

శంఖుస్థాపన 23-4-78 తేదీ ఉదయం 9-55 ని॥ల జరపాలని శ్రీ పూర్ణానందస్వామి ముహూర్తం నిర్ణయించారు. ఆ శుభ సమయానికి స్వామివారిని ఆహ్వానించగా వారు ‘అనంతమైన బాబాయొక్క ఆధ్యాత్మిక శక్తిచేత ఆచార్యులవారు ఆదేశింపబడినారు. గనుక ఎంతటి కార్యమైనా వారిద్వారా సఫలమౌతుందనీ, తాము తప్పక రాగలమనీ వ్రాశారు. తరువాత


శ్రీ రంగన్నబాబుగారు, శ్రీపూర్ణానందస్వామివారు ఇద్దరూ కూడా శ్రీ ఆచార్యులవారే శంఖుస్థాపన చేయాలని భగవత్ సంకల్పమని, మందిర కార్యంబాగా జరుగగలదనీ చెప్పారు.


శంఖుస్థాపన చేస్తున్న ఆచార్యులు

సరిగ్గా శంఖువు నభిషేకించే సమయంలో వివిధ ప్రదేశాలనుంచీ వచ్చిన భక్తులు తమతో గోదావరీ, కృష్ణ, కావేరీ, తుంగభద్రా నదీజలాలను తమతో తెచ్చారు. ముందే గంగాజలం తెప్పించి వుంచడంతో పంచ గంగలతో అభిషేకం జరిగింది. శ్రీ సాయి పాదస్పర్శతో పునీతమైన శిరిడీ మట్టినీ, ద్వారకామాయిలో 60 సం॥లు బాబా స్పర్శను పొందిన కొన్ని రాళ్ళనూ శంఖువులో వుంచారు. ఆర్థిక వసతిలేక నవరత్నాలను తెప్పించక పోయినా మద్రాసులోని ఒక భక్తునికి ప్రేరణకలిగి శంఖుస్థాపన రోజున వాటిని తెచ్చియిచ్చారు. శంఖుస్థాపన సమయానికి పూర్తయింది. స్థానికులైన శ్రీఖాజా మొహిద్దీన్ గారికి శంఖుస్థాపనరోజు తెల్లవారుఝామున స్వప్నంలో దివ్యపురుషుడైన ముస్లిం దర్శనమిచ్చి మందిరం వద్ద ప్రార్థన చేయమని ఆదేశించగా వారలాగే చేశారు. అదే సమయానికి యిద్దరు క్రైస్తవులైన సాయి భక్తులు వచ్చి క్రైస్తవ ప్రార్థనలు చేశారు. వేద పండితులు వేద ఘోష చేశారు. శ్రీ సాయి సాంప్రదాయానుసారం అలా వివిధ మత ప్రార్థనలు జరిగాయి. ఆరోజే సుమారు 2,3 వేల మందికి షడ్రసోపేతమైన సంతర్పణ జరిగింది.


ఆరోజు సాయంత్రం 5-30 గం॥లకు స్థానిక సాయి భక్తుడు శ్రీ చంద్రశేఖర్‌గారు శిరిడీ నుంచీ వస్తూ సాయి భక్తాగ్రేసరుడైన శ్రీ మహాల్సాపతిగారి కుమారుడు శ్రీ మార్తాండగారు సాయి స్వహస్తాలతో తన తండ్రిగారికి ప్రసాదించిన ఊదీ పొట్లమిచ్చి అదెలాగైనా శంఖువులో పడేలాగ చూడమని చెప్పి పంపారు. అయితే రైలు అందక పోవడంతో ఆయన వచ్చేసరికి




నిర్మాణంలోనున్న కరుణాలయం

ఆలస్యమైంది. ఆతృతతో శంఖువువద్దకు వెళ్ళి చూడగా బేల్దారు శంఖువును ఇటుకలతో పూర్తిగా యూయకుండానే వెళ్ళిపోయాడు. ఆనందంతో ఆ ఊదీ పొట్లాన్నందులో వేశాక బేల్దారి వచ్చి మిగతా కార్యక్రమాన్ని పూర్తి చేశాడు.

జూన్ 25, 1979న శ్లాబు పోయడానికి కుదుర్చుకున్న పనివారు సాయంత్రందాకా పనిచేసి పని పూర్తికాకముందే వెళ్ళిపోయారు. మిగిలిన 6,7 గురు భక్తులూ పని ఎలా పూర్తిచేయాలో తెలీక సాయిని స్మరిస్తూ కూర్చొన్నారు. అయితే చిత్రంగా గత 7,8 సం॥లుగా భజనకు హాజరైన భక్తులు, ఆ మధ్యలో చాలకాలంగా రాలేకపోయినవారు సుమారు 20 మంది దాకా వారికై వారేవచ్చి పనిలోకి దిగారు. తర్వాత కొంతమంది కూలీలుకూడా వచ్చి కలవడంతో పని సక్రమంగా ముగిసింది. శ్లాబు పోస్తున్నంతసేపూ ఆకాశం మేఘావృతమై సన్నని వానజల్లు పడుతూండడంతో సూపర్‌వైజర్ శ్రీ సీతారామయ్యగారు శ్లాబు పాడై పోతుందని ఆందోళన చెందారు. కానీ అలా జరుగలేదు. తెల్లవారుఝామున 2-30 గం॥లకు కుండపోతగా వర్షం పడింది. తెల్లవారేసరికి తెలిసిందేమంటే, ముందురోజు సాయంత్రం 7 గం॥ నుండి ఊరిచుట్టూరా కుంభవృష్టి పడిందని! "బాబా మాలిక్ హై" అనుకున్నాము.



నిర్మాణంలోనున్న కరుణాలయం


కరుణాలయ ముఖ దర్శనం


తర్వాత విజయకుమార్‌గారు పార్ధానింగాలోని సతీఅనసూయా మాతను దర్శించి మందిరానికి ఆమె ఆశీస్సులను మనసులోనే కోరుకోగా, ఆమె "కొత్త భవనం నిర్మిస్తున్నారు.

"అక్కడ పిల్లలు బాగా భజన చేస్తారు" అని పాడారట.

ఒక భక్తురాలు తయారు చేయించి యిచ్చిన 6 అడుగుల సాయి పటాన్ని మా సత్సంగ మందిరంలో కొంతకాలం పూజించి తర్వాత మందిరంలో స్థాపన చేయాలని శ్రీ భరద్వాజ గారికి 29-10-79న తోచింది. 30-10-79న ఉదయం 10 గం॥లకు పటాన్ని ఆవిష్కరించడమైనది. అదేరోజు శ్రీ విజయకుమార్‌గారు శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ అనసూయామాత, శ్రీ గజానన్ మహరాజ్ (షేగాంవ్) శ్రీ పుండలీక మహరాజ్, శ్రీ నరసింహ సరస్వతి స్వామి (గాణ్‌గాపూర్), శ్రీ మాణిక్య ప్రభువుల తీర్థ ప్రసాదాలతో వచ్చారు. శ్రీ ప్రకాశరావుగారు చివటం అమ్మ ప్రసాదం తెచ్చారు. నాటి రాత్రంతా అఖండ నామ సంకీర్తన, భజన జరిగాయి.


తపోవనంలో సాయితో మాస్టర్


ఒకసారి శ్రీ భరద్వాజ మాస్టరుగారు విద్యానగర్‌లో తుదిమెరుగులు దిద్దుకొంటున్న సాయి మందిరానికి గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామిని ఆహ్వానించారు. సాధారణంగా ఒప్పుకొనని స్వామి వెంటనే సరే నన్నారు. కానీ అంతా సిద్ధమయ్యేసరికి ఆలశ్యం కావడం, భక్తులు దర్శనానికి రావడంతో స్వామి ఆరోజు విద్యానగర్ రాలేదు. వెంకయ్యస్వామి రాకను గూర్చి మాకాని వెంకటరావుగారిలా వ్రాశారు : షుమారు 1 1/2 నెల తర్వాత అంటే 30-9-1980న హఠాత్తుగా స్వామి "విద్యానగర్ బయలుదేరుదామయ్యా" అన్నారు.


కరుణాలయంచెంత ఆచార్యులు



అపుడు నేనూ, బ్రహ్మచారి గురవయ్య, డ్రైవరు మస్తానయ్య స్వామితోపాటు కారులో విద్యానగర్ చేరాము. శ్రీ భరద్వాజగారు సతీ సమేతంగా స్వామి దర్శనం చేసుకొని ఆలయంలో స్వామిని విడిది చేయించారు.

కొత్తచోట ఎక్కడా ఒక్క రోజులోనే వెళ్ళిపోదామని గొడవచేసే స్వామి, విద్యానగర్‌లో ఎప్పుడూ ఎరుగని ప్రశాంతతతో నాల్గురోజులున్నారు. తండోపతండాలుగా జనం స్వామివారి దర్శనం చేసుకొన్నారు. మందిరంలో సాయి బాబాకు రోజూ నాలుగుసార్లు జరిగే హారతి వేళలలో స్వామి ఎంతో ప్రసన్నంగా కూర్చొని మెల్లగా చేతులు తట్టేవారు. సాయిబాబాతో పాటు తనకూ శ్రీ భరద్వాజ గారు హారతిస్తే ప్రసన్నంగా ఉండేవారు. శిరిడీ నుంచి వచ్చిన సాయిభక్తులు తెచ్చిన బాబా ప్రసాదం ఇవ్వగా సంతోషంతో తీసుకొన్నారు. గురువారంనాడు శ్రీ భరద్వాజగారు బాబాకు పూజచేస్తూ 'ఆసనం సమర్పయామి' అనగానే స్వామి లేచికూర్చున్నారు. 'నైవేద్యం సమర్పయామి' అనే సమయానికి ఎప్పుడూ జన సమూహంలో ఆహారం తీసుకొనని స్వామి తమకు "ఉడుకునీళ్ళు (హార్లిక్స్, బిస్కట్ల పొడి కలిపిన పాలు) ఇవ్వండయ్యా" అనడిగి త్రాగారు.


కరుణాలయంలో
శ్రీవెంకయ్యస్వామితో మాస్టరు

శుక్రవారం సాయంత్రం శ్రీ భరద్వాజగారు స్వామిపాదాల సమీపంలో మందార పూలుంచి సత్సంగం చేస్తూండగా స్వామి మందార పూలకేసి నన్ను చూడమన్నారు. ఎప్పుడూ రంగుపూలు తాకనైనా తాకరని తెలుసుగనుక వాటిని తీసివేయబోగా "అయ్యా! ఎక్కడికి తీసుకుపోయేది? ఇక్కడపెట్టు" అని తమ పాదాలు చూపారు.



ధ్యానముద్రలోని మాష్టరుతో వేణుగోపాల్

ఆరాత్రి గం॥1-52 ని॥లకు స్వామి లేచికూర్చొని ఎంతో సంతోషంగా ఉండడం చూచి వేము "స్వామి! (సాయిబాబా) మందిరం బాగుందా? ఎన్ని సంవత్సరాలు ఇక్కడ పూజలు జరుగుతాయి?" అనడిగాము. దానికివారు చాలా బాగుందని నాల్గుసార్లని కాసేపు మౌనంగా వుండి "ఎల్ల కాలమూ పూజలు జరుగుతాయి. బాగుంటుంది" అన్నారు. వారచటకు వచ్చిన రెండవ రోజునే గురవయ్య "స్వామీ! ఇక పోదామా?" అని అడగ్గా వారు, "దారి కనిపించడం లేదయ్యా, పై వాళ్లొప్పుకోరు. మనమిక్కడ ఇరవైకోట్లు జమకట్టాలి" అని చెప్పి ఉన్నారు.

శనివారం ఉదయం స్వామికి స్నానం చేయించి, వెూనుకొొచ్చి



శ్రీ సాయి చిత్రపటం తొలి ఉరేగింపులో ఏ.వి. కృష్ణయ్యశెట్టిగారు



12-3-81తేదీన తొలి కుంభాభిషేకం కరుణాలయంలో సాయి చిత్రం ప్రతిష్ఠ

మందిరంలో పడుకోబెట్టగానే వారు తుండుగుడ్డనెత్తిపై సాయిబాబాలాగా చుట్టుకొని కూర్చొని 'సాయిబాబా, సాయిబాబా" అని పెద్దగా అంటూ ఉండినారు. అక్కడ "స్వామీ! మీకిక్కడ బాగుందా?" అనడిగిన శ్రీ సూర్యప్రకాశరావుగారితో "అయ్యా! సాలుగా ఉన్నది" అన్నారు స్వామి.



## మందిర ప్రారంభోత్సవం - ప్రథమ కుంభాభిషేకం : 12-3-1981



గోపురంపై కలశ పూజలో మాస్టార్

మాస్టారి హృదయ రూపమా అన్నట్టు రూపు దిద్దుకొన్న మందిరానికి మార్చి 12, 1981 ప్రారంభం, కుంభాభిషేకం, సాయి చిత్రపటావిష్కరణకు ముహూర్తంగా నిర్ణయించబడింది. సమయానికి భక్తుల ద్వారా మహనీయుల తీర్థ ప్రసాదాలు వచ్చాయి. స్వామి శ్రీ కేశవయ్యజీ, శ్రీ కామేశ్వరమ్మ, శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యుల వంటి మహనీయులు వేంచేశారు. సాయి చిత్రపటాన్ని బాబా భక్తాగ్రేసరులు శ్రీ కేశవయ్యజీ ఆవిష్కరించారు. శ్రీ చివటం అమ్మ ప్రత్యేకంగా భక్తుల ద్వారా కొబ్బరికాయ ప్రసాదంగా పంపి ఉన్నారు. అక్కడ చివటంలో అదే సమయంలో తమ చుట్టూఉన్న భక్తులకు ఇక్కడ విద్యానగర్ ఏక్షణాన ఏ కార్యక్రమం జరుగుతున్నాదో చెబుతూ ఉన్నారట. వారు తర్వాత ఉత్తరంద్వారా తెలిపారు. దూర తీరాల నుండి వచ్చిన భక్త జన సందోహంతో ఆ కుగ్రామం పోటెత్తింది. ప్రతి ఇల్లూ అతిథి గృహమే. స్థానికుల సంబరానికి అవధి లేదు. 20 వేలకు పైగా భక్తులా ప్రారంభోత్సవాన్ని, కుంభాభిషేకాన్ని కన్నుల పండువుగా తిలకించారు, పాలువంచుకున్నారు, తృప్తిగా ప్రసాదం భుజించారు, మహనీయుల ఆశీస్సు లందుకొన్నారు. మాస్టారి దర్శన స్పర్శన భాగ్యాన్ని పొందారు. ఇలా మహనీయుల ఆశీస్సులతో, ప్రేరణతో, ఒక మహనీయుని నిరంతర పర్యవేక్షణలో నిర్మితమైన ఈ సాయి మందిరం వారందరి ఆశీస్సుల రూపంలో సాయి మనకై నిలిపిన కరుణాలయం.



తొలి కుంభాభిషేక పూజలో జె. గోవిందప్ప, సాయి, ఎ.వి.రమణయ్య, కె. శేషాద్రి, శ్రీఎ.వి. కృష్ణయ్యచెట్టిగారు.

## శ్రీ సాయి, దత్త విగ్రహ ప్రతిష్ట

1995లో మరొక ముఖ్య ఘట్టం జరిగింది. ఆచార్యులందరనూ సంపూర్ణంగా సాయినాథుని కప్పగించి తాము తమ రూపాన్ని ఆయనలోనే మరుగుపరచారు. ఐనా తమ ప్రేమ అవధులు లేనిదని యీ కార్యక్రమం మా కందరకూ నిరూపించింది. 'నడిపే వాడవు నీవే' వనుకొన్నాం. ముహూర్తానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. విగ్రహ ప్రతిష్ట నాగపూర్ గులాబ్ బాబాగారి కరకమలాల మీదుగా జరగాలన్నది అందరి కోరిక. ఆహ్వానించడానికి వెళ్ళిన హరిబాబు బాబాకు మనసులో చెప్పకొని, మాస్టారిని తలచుకొని మొండి వాడిలా గులాబ్ బాబాగారి వాకిట కూర్చున్నాడు. అక్కడి వారు వెళ్ళి పొమ్మన్నా కదల లేదు. ఆ దీక్ష గులాబ్ బాబానే కదలించింది. వారిని విద్యానగర్‌కు తరలించింది. సాయినాథుని మరియు దత్తాత్రేయుని పాలరాతి విగ్రహాలు గులాబ్ బాబాగారే ప్రతిష్టించారు. కుంభాభిషేకమూ, హోమాది కార్యక్రమాలు, అన్నదాన విశేషాలు, గులాబ్ బాబాగారి దర్శనాదులతో సాయీశుని కరుణతో భక్త జన సందోహం ఆనంద సంద్రమే ఐంది.


## మాస్టరుగారి విగ్రహ ప్రతిష్ట : 8-3-2004

ఆచార్యుల వారి పాలరాతి విగ్రహం ప్రతిష్ట కొరకు సరైన ముహూర్తం నిర్ణయించి జలధాన్యాధి వాసాలు హోమాధికాలు జరిపించి శ్రీ కోనస్వామి (శ్రీశ్రీశ్రీ శ్రీపాద కామేశ్వరేంద్ర తీర్థ స్వాములు) గారి ఆధ్వర్యంలో ఆచార్యుల కుమార్తె, అల్లుడు అయిన శ్రీమతి వేదమ్మ, శ్రీ శ్రీకాంత్‌లు, కుమారుడు శ్రీ ద్వారక్‌నాథ్‌లచే ప్రతిష్ట జరిపించారు. అదొక ఆనందహేల. ఎవరిని చూచినా కారే కన్నీళ్ళతో వారి స్మరణతో తాదాత్మ్యంతో జరిగిన విశేషమది.

## శిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆవిర్భావం

మందిర కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ కొనసాగించడానికై కావలసిన అర్ధ వస్తు సేకరణకై, ఆధ్యాత్మ విద్యా ప్రచారానికై "శిరిడీ సాయి కల్చరల్ మిషన్" అన్న పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేయబడింది. దాని నిర్వహణకై సభ్యులతో ఆ సంఘాన్ని రిజిష్టరు చేయించారు మాస్టరుగారు.


శిరిడీసాయి కల్చరల్ మిషన్ ఏర్పాటులోని ఉద్దేశ్యాలను మాస్టారుగారు క్రింది విధంగా నిర్దేశించారు :



ఉచిత వైద్యశాల ప్రారంభోత్సవంలో ఆచార్యులు

సంఘంలో ఉన్న దుఃఖితులకు ఉపశమనం. దుఃఖానికి మూల కారణాలను సాంఘిక అసమానతలను, అనైక్యతను సమూలంగా తొలగించడానికి తగువైన కార్యాచరణను చేపట్టడం ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఉద్దేశ్యాన్ని సాధించడానికైన అన్ని కార్యాలకు కేంద్రంగా సాయి మందిరం పల్లె ప్రాంతపు విద్యా కేంద్రమైన విద్యానగర్‌లో నెలకొల్పబడింది. కులము, మతము, తెగలు అంటూ మనుషులను విభజించే అడ్డుగోడల నధిగమించడానికి నిలబడిన ఈ శిరిడీసాయి కల్చరల్‌మిషన్ తన ఆచరణ కేంద్రంగా ఈ మందిరాన్ని నిర్మించింది.


పరిసర పల్లెప్రజల ఆరోగ్యానికి మొదటి మెట్టుగా హోమియోపతి వైద్యం ద్వారా తదుపరి అన్ని సక్రమమైన వైద్య విధానాల ద్వారా తన సేవను ఆయా గ్రామాలలో తరచు చేపట్ట నిశ్చయం ఉన్నది. తద్వారా ప్రజలతో సంపర్కం ఏర్పరచుకొని తమ కార్యక్రమాల ద్వారా వారిలో నైతిక, ఆధ్యాత్మిక, మానవతా వికాసాన్ని కల్గించ గలుగుతుంది. సత్సంగాలు, సద్గోష్ఠులు,



ప్రస్తుత ఉచిత వైద్యశాల



ప్రచార సాధన సంపత్తి ద్వారా మహాత్ముల చరిత్ర బోధలు, వివిధ మతాల సారాంశాలూ గ్రామీణులకు వివరించడం, అక్కడక్కడ వారే వీటిని నడుపుకొనే విధంగా పల్లె కేంద్రాలను ఏర్పరచడం; తల్లిదండ్రులు, వ్యాపారులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు, ప్రజలుగా వారి కర్తవ్యాన్ని గుర్తెరిగి సదాచరణలో దానిని నెరవేర్చగలిగేలా తయారయేందుకు దోహదపడే కార్యక్రమాలను సత్సంగాలను జరిపించడం; సృష్టి, మానవుడు, ఉనికి, కర్తవ్యం మొ॥ విషయాలను గూర్చి వారికి అవగాహన కలిగించడం వంటి కార్యక్రమాలు ఈ మిషన్ చేపడుతుంది.



సాయి కరుణాలయం

రాబోయే తరానికి తీర్చి దిద్దబడిన పౌరులనందించగలిగేందుకై విద్యాలయాలను స్థాపించడం, ఉన్నవాటిని దత్తత తీసికోవడం మరొక ప్రధాన ఉద్దేశ్యం. మామూలు విద్యతోపాటు మానవతా విలువలను పెంపొందించే విధంగా వాటిని నడపడం ముఖ్యం.

ఆధ్యాత్మిక సంబంధమైన రచనలు, గ్రంథాలు, వివరణలు; అట్టి విషయాలను ఆవిష్కరించే కథలు, గాథలు, నవలలు, పత్రికలు, సృజనాత్మక రచనలు ప్రచురించడం

వివిధ ఆధ్యాత్మిక సంఘాలు, సంస్థల మధ్య సదవగాహనను పెంచి పరస్పర సహకారాన్ని నెలకొల్పడం. ఈ ప్రయత్నానికి అవసరమయ్యే **Type writer** వంటి సాధనాలు, **Press** వంటివి నెలకొల్పడం.

ఇటువంటి కార్యక్రమానికి పట్టుగొమ్మలుగా సాయిమందిరాలు స్థాపన, బోధన ప్రజలు వారివారి మతాల పట్ల సదవగాహనతో ఆయా ప్రార్థనాదికాలను పాటించే విధంగా సహకరించడం; ఆ మందిరాలకు అనుబంధంగా, గ్రంథాలయాలు, పఠన మందిరాలు, విద్యా కేంద్రాలు, వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయడం. ఇవన్నీ భవిష్య కాలంలో కూడా కొనసాగేందుకు కావలసిన

సదుపాయాలు, ఏర్పాట్లు, వినియోగాలకు కావలసిన ఆర్ధిక స్థితికై ఉదారుల సహకారాన్ని పొందడం. సేవా భావం గలవారు తీరిక వేళల్లో ప్రత్తి వడకడం, బట్ట తయారు చేయడం, అది పేదల కందజేయడం.


పుస్తకాలు, ప్రచార సాధనాలు, ప్రయాణ సాధనాలు, సేవ, వివిధ వస్తు ఆర్థిక రూపంగా సహకరించే సహృదయుల నుండి ఆయా వాటిని సేకరించడం, సద్వినియోగ పరచడం.

**మాస్టారితో ప్రారంభమైన నాటి నుండి నేటి వరకూ శిరిడీ సాయి కల్చరల్ మిషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలిలా ఉన్నవి :**

మందిర శంఖుస్థాపన 23-4-1978 ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టారి స్వహస్తాలతో, శ్రీశైలం పూర్ణానందస్వామిజీ, శ్రీ కృష్ణమాచార్యుల వంటి వారి ఆశీస్సులతో జరిగింది.

12-3-1981న సాయి మందిర ప్రారంభం. 6 అడుగుల సాయినాధుని చిత్రపటం స్వామి కేశవయ్య గారిచే మందిరంలో ఆవిష్కరణ. కుంభాభిషేక మహోత్సవం.

1988 మాస్టరుగారి చేతుల మీదుగా ధుని ప్రారంభం - ఇది ఈ సాయి మందిరానికి మాస్టరుగారి చివరి ఆగమనం. ధునిలో అగ్నిని వేసే సమయంలో కృష్ణయ్యచెట్టిగారి చేతిలో చెయ్యివేసి 'ఇక మందిరం పూర్తి బాధ్యతలు మీరే చూసుకోవాలి. మీకు తెలుసు ఎలా నడుపు కోవాలో. దానికై ఏమి చేసినా ధర్మమే. ఇకపై ఈ బాధ్యత మీది' అని అప్పగించారు.




కరుణాలయంలో
ఆచార్యులవారు స్థాపిస్తున్న ధుని

1989 నాటికి ఆచార్య శ్రీ భరద్వాజగారి గుర్తుగా ధ్యాన మందిర ప్రారంభం.

మందిరానికి ప్రహరీ, కార్యాలయం గదుల నిర్మాణం

కళ్యాణ మండపానికై సేకరించిన స్థలానికి ప్రహరీ నిర్మాణం





కరుణాలయంలో దత్త మందిరం


1995 శ్రీ సాయినాధుని మరియు దత్తాత్రేయుని పాలరాతి విగ్రహ ప్రతిష్ట, శ్రీ గులాబ్‌బాబాగారి చేతులమీదుగా సుసంపన్నమైన ఈ విశేషంతోపాటు కుంభాభిషేకం కన్నుల పండువుగా జరుపబడింది.

12-3-2001లో మాస్టారి నివాసంతో కార్య క్షేత్రంగా మారిన ఇంటిని "తపోవనం"గా ఆవిష్కరించుట. ఇది మాస్టారి శిష్య భక్తులకందరకూ ఎంతో ఆనందాన్ని కలిగించింది.

2004లో ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారి విగ్రహ ప్రతిష్ట

నిత్య పూజలతోపాటుగా విశేష పూజలు, పర్వదినాలలో పూజా అన్నదాన ఉత్సవ కార్యక్రమాలు

పరిసర గ్రామాల ప్రజలందరకూ ప్రతి గురువారం ఉచిత హోమియో వైద్య సేవ నిరంతరాయంగా జరుగుతున్నది. గత కొన్ని సంవత్సరాలుగా E.K. సేవా ట్రస్టు వారి సహకారముతో ఈ సేవలు ఉదారంగా అందిస్తున్నారు.




కరుణాలయ గురుభరద్వాజ మందిర్



కరుణాలయంలో గురుస్థాన్

ఇన్ని సంవ్సరాలుగా 'ఆచార్యవాణి' గా అందరికీ ఉచితంగా అందుతున్న Spiritual Bulletin నిర్వహణ




**సాయి మందిరంలో జరిగే కార్యక్రమాలు : నిత్య / విశేష పూజాక్రమాలు :**

| | | | |
|---|---|---|---|
| ఉదయం | : | గం. 5-30 లకు | సుప్రభాతం |
| | | గం. 6-00 లకు | కాకడ హారతి |
| | | గం. 7-00 లకు | దత్త, సాయి, మాష్టర్లకు అభిషేకం |
| | | గం. 10-00 లకు | విష్ణు సహస్రనామావళితో పూజ |
| మధ్యాహ్నం | : | గం.12-00 లకు | మధ్యాహ్న హారతి |
| సాయంత్రం | : | గం. 4-00 లకు | బాబా నామావళితో పూజ |
| | | గం. 6-00 లకు | సాయం హారతి |
| | | గం. 7-00 లకు | సత్సంగము, భజన |
| రాత్రి | : | గం. 8-15 లకు | శేజ్ హారతి |

గురువారాలలో ప్రత్యేకంగా సాయంకాల సమయాలలో పల్లకి సేవ

పర్వదినాలలో విశేషంగా గ్రామోత్సవం, అన్నదానాలు, సద్గోష్టి కార్యక్రమాలు

ప్రతి రెండవ ఆదివారం శ్రద్ధాళువులు ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 6 గం॥ లవరకు తపోవనంలో నిరవధికంగా జరుపుకొనే సత్సంగ కార్యక్రమాలు

గమనిక : మందిరం ప్రతిరోజూ ఉదయం 6 గం॥ నుండి 12 గం॥ వరకు తిరిగి సాయంత్రం గం4॥ నుండి గం.9॥ వరకు తెరచి ఉంచబడును.

***గురు, ఆదివారాలలో ఉదయం 6 గం॥ నుండి రాత్రి 9 గం॥ వరకు నిరాఘాటంగా తెరచి ఉంచబడును.***



**ప్రధానమైన పర్వదినాలు :**

మార్చి 12వ తేది : మందిర వార్షికోత్సవం

ఏప్రెల్ 12 తేది : ఆచార్యుల ఆరాధన

చైత్ర శుద్ధ నవమి : శ్రీరామ నవమి

గురుపూర్ణిమ

విజయ దశమి : సాయి సమాధి ఉత్సవం

అక్టోబరు 30 వ తేది : ఆచార్యుల జన్మోత్సవాలు

దత్త జయంతి

**ఉదారులు, భక్తులు సహకరించదగిన పూజాదిక విశేషాలు**

**శ్రీ శిరిడీ సాయిబాబా మందిరము-విద్యానగర్**

ఆలయంలో శాశ్వత పూజల వివరాలు

| | | |
|---|---|---|
| 1. | పూజ (యం.ఓ ద్వారా 25-00) | 16-00 |
| 2. | శాశ్వతపూజ (సం॥ ఒక రోజున) | 516-00 |
| 3. | ధునిపూజ | 40-00 |
| 4. | శాశ్వత ధుని పూజ (సం॥లో ఒక రోజున) | 816-00 |
| 5. | శాశ్వత అఖండ దీప సేవ | 816-00 |
| 6. | శాశ్వత పూజ (5 పర్వదినములలో) | 2,516-00 |
| 7. | శాశ్వత అన్నదానం (సం॥లో ఒక పర్వదినమున) | 1,116-00 |
| 8. | సర్వ సేవలు (పై 2,4,5 మరియు 7 సేవలు) | 2,116-00 |
| 9. | పల్లకి సేవ | 75-00 |
| 10. | రుద్రాభిషేకము | 701-00 |
| 11. | సాయి సత్య వ్రతము (సామూహికముగా) | 58-00 |



*మాతృశ్రీ ఎక్కిరాల అలిమేలు మంగమ్మతల్లి, చి॥ వేదవతి, చి॥ ద్వారకబాబుతో మాష్టర్*

## తపోవనం ప్రాశస్త్యం

స్వార్థపు ఆశయాలు లేకుండా 'సాటివారికి నేనెలా సాయపడగలనో!' అనే తపనతో, అందరిలో దాన్ని కల్గించాలనే ఆశయంతో రాత్రింబవళ్ళు తన చెంతకొచ్చే వారెవరు అనేది చూడక తన చెంత చేరిన వారికి నీడనిచ్చే చెట్టులా ఆత్మీయతతో సంశయ విచ్ఛేదం చేసిన ఇలవేల్పు మన మాస్టారు. తనదైన శైలిలో ఉపమానాలతో వివరించే ప్రజ్ఞగల భోధాసత్త్వులే మన మాస్టారు. వివరణాత్మక తత్వమే, చైతన్యమే మాస్టార్ రూపంలో ఆవిష్కరింపజేసి ప్రజల మనస్సులను ఆధ్యాత్మిక మార్గం వైపుకు ప్రేరేపించేలా చేసిన సాయి మహరాజుకు నమస్సుమాలే మనమివ్వగలిగింది.

ఆధ్యాత్మిక తత్వాన్ని ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో సమన్వయించి నేటి సమాజంలోని మనోదౌర్భల్యాన్ని ఎలా అధిగమించాలో తెలియజేసిన నాటి ప్రదేశమే నేటి శ్రీ గురుభరద్వాజ తపోవనం. ఇక్కడ నిరంతర స్వాధ్యాయ ప్రవచనాలతో ఉర్రూతలూగించి, ధర్మబోధ సుప్రతిష్ఠ చేయటం ఆచార్యుల వారికే చెల్లింది. ఆరోజుల్లో విద్యానగర్‌నందు మాస్టారుగారు నివసించిన ఇంటి గది... ఒక చర్చావేదిక; బడి; పూజా మందిరం; ఆధ్యాత్మిక గురుకులం; సాధనా ధ్యాయం తొలిగా తెరచి మలి అధ్యాయం వైపు నడిపిస్తున్న యోగశాల; మనవంటి ఎందరికో తమ ఊహలు, నిశ్చయాలు, అభిప్రాయాలు ఆయన మాటల ఝరిలో కులకుల పేకమేడల్లా కూలిపోతున్నా, కోరికలూ ఆశలు సత్యాగ్నిలో వ్రేల్చబడి ఏదో 'విభూతి' నందిస్తున్నా, ఆగది తన అంచున విరుస్తూన్న వెలుగు రేఖలు ప్రసరించిన హోమ వేదిక. ఎన్నోసార్లు కాలం చెల్లిన క్షణాలు ఇంకా గుర్తుకు తెచ్చే అయన సన్నిధి ఎలా మరుస్తాం? ఎలా మారుస్తాం?!



వయస్సుతో నిమిత్తం లేకుండా ఎన్నిజీవులు, ఎందరు వ్యక్తులు తమ ఆర్థిక స్థితుల గిరిదాటి... 'ఇందువలన' అని .. వివరంగా చెప్పలేకున్నా – తమ మనస్సు విప్పి చెప్పుకోడానికి – తమకేమీకాకున్నా – అత్యంత ఆప్తుడు, ఆసరా, దేవుడు అక్కడ ఉన్నాడన్న ధీమాతో వచ్చి సేదదీరిన ఒయాసిస్సు. సాయి, రమణులు, క్రీస్తు, స్వామి సమర్థ, మిలారేపా, మాణిక్యప్రభు, రామకృష్ణ, వివేకానంద, ఇలా చెప్పుకుంటూపోతే అంతులేని పట్టికగా తయారయ్యే మహాత్ముల చరిత్రల, బోధనల జ్ఞాన, మధనం ఆయన వివరణ మనలాంటి బడుగులాస్వాదించిన చోటు. ఎందరి మహాత్ముల జీవితాలో ఆయన కలం



*తపోనం గదిలో భరద్వాజ గురుదేవులు*

చిత్రించిన జీవన చిత్రశాల. ఎన్ని సత్సంగాల ప్రారంభానికో నాంది, ఎన్ని సాయి మందిరాల నిర్మాణానికో పునాది, నిర్విరామంగా ఆయన భావ ప్రకంవనాలను, పూజా యోగా కుసుమాల పరిమళాలనూ, జ్ఞాన విజ్ఞాన ప్రబోధనలనూ, ఆకాశాన్నంటిన విజయోత్సవాలకూ, పాతాళపు చీకటిని నింపిన దుర్విదగ్ధ క్షణాలకూ ఒకే విధంగా – చైతన్య ఘనత, బ్రహ్మ సమరసత ఆయనగా నిలిచిన ఆ గది; లోకాన్నంతా సాయి సంసారంలో చేరుస్తూ, తన చిన్న సంసారాన్ని ఆరంభించిన ఆ ఇల్లు ... మాష్టరు గారిని గుర్తుకు తేనిదీ, ఆయన రూపాన్ని మరుగున పడవేయగలదీ, ఆయన స్వరాన్ని విన్పించనిదీ, ఆయన చూపును తళుకించనిదీ ఆ గదిలో ఏదీ లేదు. ఆ గది ... అది ఆయన మదిలో మనమున్నదీ, మన మదిలో ఆయన వెలిగించిన మణిదీపమది.

ఆ ఇల్లు ఉత్త మట్టి, సిమెంటు, ఇటుకలు మాత్రమే కాదు. ఎందరికో మాస్టారి మొదటి దర్శనం అయిన చోటు. ఆ మారుమూల చిన్న ఊరిలో ఏమి దొరకని ఆ రోజుల్లో కూడా ఏ రాత్రికైనా సరే అక్కడకు చేరి ఆయనను చూడాలని శ్రమకోర్చి వచ్చిన ఎందరికో ఆయనను చూడగానే శ్రమ ఎగిరిపోయేది.

మాటాడితే జీవితానికొక ఆసరా దొరికేది. ప్రసాదం అందుకుంటే స్ఫూర్తి నిండేది. ఎందరు తమ సమస్యలు, కష్టాలు చెప్పుకుని సమాధాన పడేవారో! ఎందరికో పునాదిలేని విశ్వాసాలు కూలి పటిష్టమైన ఆధ్యాత్మిక ఆసరా ఆయన అక్కడ అందించారో! 'మా స్వామి దగ్గరకు పోయిరావాల' అని బయలుదేరి వచ్చే వారెందరో. ఆ 'మా స్వామి' అని పలికేటప్పుడు వారి గొంతూ, కళ్ళూ, పలికించే ఒలికించే భావం!! ఎందరు ఎన్ని అనుభవాలను అక్కడ మూట కట్టుకున్నారో, తెలుపుకున్నారో! ఏ విలువల పరిధిలోనికి ఒదగని ఆ అందాల, ఆనంద విజ్ఞాన ఖని!! అంతటి తన విలువను సుంతైనా తనదనక ఆ స్థలానికి ఆ విలువరావడానికి ఓ ముస్లిం మహాత్ముడు కారణమని చెప్పిన విషయం గుర్తుంది. నారాయణ మహరాజ్, రంగన్న బాబు వంటి ఎందరో మహాత్ములు ఆ సూదంటురాయి అక్కడ ఉన్నదనేగా ఆ నేలంతమ కాలూనారు. మాస్టారు తమ గరిమను వినయంగా సాయి కిరీటంలో తురాయిగా చూపేవారు. సాయి హృదయంలో తానా? తన హృదయంలో సాయా అన్నది ప్రశ్నే. శిరిడీలో సాయి విగ్రహం ఎదుట కలిగిన తాదాత్మ్యం దానికి ప్రతీక. ఆయన నివసించిన ఆ ఇంటి అన్నీ చెరగులు ఇలా ఎన్నెన్నో ఎందరకో జ్ఞాపకానికి తెచ్చి ఆయన సాన్నిధ్యాన్ని అందిస్తాయని ప్రగాఢ విశ్వాసం.

ఆ ఇంటిని ఒక స్మృతి దీపికగా ఉంచాలనే అద్భుత సంకల్పం భయంభయంగా పొటమరించినా దానిని కొనేందుకు కావలసిన విరాళాలు త్వరితంగా దాతలు మధుర హృదయాలతో అందిస్తారన్నది ఊహకందని వాస్తవం. అది వారి కృప, మీ ప్రేమపారావారం. ఇలా నిజమైంది.

ఇంటికి చిన్నాపొన్నా అతుకుల వంటివి పూర్తి చేశాం. చివరికి అది ఏ రూపాన్ని సంతరించుకుంటుందో మాస్టారికే తెలుసు. వారి సంకల్పమే దాని శిల్పి. ఆ ఇంట మాస్టారి ఛాయాచిత్రం ప్రతిష్టించి అందరి సందర్శనానికి తెరచిఉంచే ఏర్పాటు జరిగింది. మౌనంగా పారాయణ, ధ్యానం వంటి సాధన అనుసరించుకోవడానికి అనువైందిగా తీర్చాలని ఆశయం. అక్కడి ప్రతి రేణువు వారి దర్శనం చేయించేదిగా, మాస్టారి స్పర్శను అనుగ్రహించేదిగా ఉంటుందని నమ్మకం. అందరి ఆశ్వాసన మాకందించండి. స్వయంగా రండి. 2001, మార్చి 12న బాబా మందిర వార్షిక వేడుకల నాడే మాస్టారి పటాన్ని మందిరము నుండి ఊరేగింపుగా తీసుకొచ్చి వారి 'స్మృతి మందిరం'లో ప్రతిష్ట జరిగింది. మన అసలైన ఇంటికి, మాస్టారి స్మృతి మందిరానికి మనందరకూ మనమే పలికే శుభ ఆహ్వానం ఇది. రండి మాస్టారిదరికి చేర్చే ఆశ్రయమది.



## ప్రస్తుతము కల్చరల్ మిషన్ నిర్వహణకు నియమితులైన సభ్యులు:

### *శాశ్వత అధ్యక్షులు : పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు*

### *నిర్వాహక అధ్యక్షులు : శ్రీ ఎ.వి.కృష్ణయ్యచెట్టిగారు*

వీరు పరమ సాత్వికులు, మాస్టారు గారికి ప్రత్యక్ష శిష్యులు, వారి ప్రేమకు పాత్రులు, సాయి భక్తులు. కోట మండలం స్థానికులు. చెన్నై నగరంలో వ్యాపారపరంగా స్థిర పడ్డవారు. వీరు తమ వ్యాపార అనుయాయుల అండదండలతో తమ మంచితనంతో, ప్రేమ పూర్వకమైన మాట తీరుతో నిధులు సేకరించి మందిర నిర్వహణకు అహరహం పాటుపడే భక్తవరేణ్యులు. తనువెక్కడైనా వీరి మనసు హృదయాలు మాత్రం విద్యానగర్ బాబా మందిరం చుట్టూ తిరుగుతూండడం వీరిలోని విశేషం. వీరి సహోదరులు, వారందరి కుటుంబ సభ్యులు యావన్మందీ బాబాగారి పట్ల ప్రగాఢ భక్తి కలవారుగా మారడం విశేషం.

### *ఉపాధ్యక్షులు : శ్రీ ఎ.వి. సుబ్రమణ్యంశెట్టిగారు*

అన్నగారైన ఎ.వి. కృష్ణయ్యచెట్టిగారి ప్రభావంతో మెల్లమెల్లగా బాబాగారి అనుయాయిగా మారిన వారు సుబ్రహ్మణ్యంగారు. తమ వ్యాపార ప్రాభవాన్ని, ప్రణాళికా పటిమను ప్రస్తుతం మందిర నిర్వహణలో సంపూర్ణంగా వినియోగిస్తున్న వినయశీలి. మాస్టారికి విద్యార్థిగా ఉండి, ఇపుడు అన్నిట తమది ఆలోచన ఐతే తమ శరీరంలాగా మందిర కార్యక్రమాలలో విధి నిర్వహణను ఆచరించే తమ చిన్న సోదరుడు శ్రీ ఎ.వి. రమణయ్యచెట్టి సహకారం వీరిద్దరికి ఎంతైనా అండదండగా నిలిచింది. శ్రీ ఎ.వి. రమణయ్య మాస్టారి విద్యార్థి మాత్రమేకాక ఆనాటి సత్సంగ సభ్యుడు కూడాను.

### *సెక్రటరి : శ్రీ వి. సూర్యనారాయణగారు*

వీరు మాస్టారి విద్యార్థిగా, సత్సంగ సభ్యులుగా, అనుయాయిగా, మాస్టారి తీవ్ర శిక్షణతో రాటు తేలిన సేవా పరాయణులు. మందిర కార్యాలే వీరికి ఊపిరి. సూర్యుని రథాన్నిలాగే ఏడుగుర్రాల ఓర్పు వీరి స్వంతం. గుడి పరిసరంలోనే స్థిర నివాసం ఏర్పరుచుకొని సేవే పరమావధిగా సాగుతున్న నిత్య సాధకులు.

### జాయింట్ సెక్రటరి : శ్రీ వి. జనార్ధన్‌రెడ్డిగారు

వీరు సమీప గ్రామమైన కొత్తపాళెంలోని ఉన్నత వ్యవసాయ కుటుంబం నుండి వచ్చారు. మాస్టారికి విద్యార్థి. తల్లిదండ్రుల నుండి సాయి భక్తి పరిమళం వీరికి సోకింది. సాయి సేవ తమ అదృష్టంగా భావించి సేవిస్తున్న నిరాడంబరుడు.

### ట్రెజరర్ : శ్రీ కె. శేషాద్రిగారు

మాస్టారి ప్రియ విద్యార్థి. సత్సంగ సభ్యుడు. ఉన్నత విద్య పొంది కూడా వారి ఆదేశంతో వ్యవసాయాన్ని ఆదరించినవారు. సాయి సేవ మాస్టారి సేవగా, వారు తనపై ప్రేమతో అప్పగించిన చిరు బాధ్యతగా, ఆనందంగా ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవాభిలాషి. పరిసరాలలోని ఎంతో మందిని బాబా వైపుకు వినయంగా మరలించిన వారు. సాయి సేవ తరించి మార్గంగా నడుస్తున్నవారు.

### కార్యనిర్వాహక సభ్యులు :

### శ్రీమతి డి. రుక్మిణమ్మగారు

మాస్టారి సత్సంగాల నాటి నుండి వారికీ బాబాకూ తమ పనులు మానుకొని సేవ చేసినవారు. ఉపాధ్యాయిని ఐన కారణంగా నేటికీ మందిర సేవలోని తమ శిష్యులను మొదటగా మాస్టారి వైపు నడిపించిన వారీమె. ఆ సేవ తన అదృష్టంగా భావించి రుక్కక్కగా, టీచర్‌గా అందరి మన్నన లందిన వారు.

### శ్రీ కె. శ్యామ్‌ప్రసాద్‌గారు

చిన్న వయసు నుండే మాస్టారి ప్రేమ పిపాసి ఈ భక్తసారంగుడు. ఆయన నోటి మాట ఇతనికి సుగ్రీవాజ్ఞ. వారి వద్ద ఎంతో విని, ఒరపిడిపడి, వారికెనలేని సేవ చేసి ప్రస్తుతం సాయి సేవలోనే ఉంటున్నవారు. దూర తీరాల భక్తులందరకూ "GM"గా ప్రసిద్ధులు.

### శ్రీ యస్. రాజశేఖర్‌గారు

తన టీచరు, ఆపై బావ, తన తల్లి - వారి వెంట తానూ - అనుకొంటూ చిన్ననాటనే మాస్టారి మాట ప్రభావాన్ని చవి చూచిన వారు. మందిరం చెంతనే 'గూడు' కట్టుకొని విశ్రాంతి సమయాన్ని అవిశ్రాంతంగా బాబా మందిర సేవ చేసుకొంటున్న బాబా సేవకుడు.




### శ్రీమతి వనజాక్షమ్మగారు

వీరు మాస్టారుగారితో పాటుగా కాలేజీలో సహోపన్యాసకులుగా పని చేశారు. సాయి భక్తి మెండుగా గలవారు గనుక మందిర కార్యక్రమంలలో నాటి నుండి పాల్గొంటూ తమ సలహా సహాయ సహకారాలను సహృదయంతో అందిస్తున్న వారు.

వీరుకాక మరెందరో...శ్రీ జి. సూర్యప్రకాశరావు, శ్రీ సుధాకరరెడ్డి, శ్రీ జె. గోవిందప్ప, శ్రీ టి.డి. కృష్ణమూర్తి, శ్రీ సిహెచ్. శ్రీనివాసులురెడ్డి, శ్రీ అల్లు భాస్కరరెడ్డి, కొత్తపాళెం గ్రామస్తులు శ్రీ రామిరెడ్డి గోపాలరెడ్డిగారు వారి బంధువులు, శ్రీ ఆశం చంద్రశేఖర్, శ్రీ కేశవులుగార్లు వంటి ఎందరో 'మాస్టారి సహచరులు, విద్యార్థులు నేడక్కడే స్థిరపడి వారి సహకారాన్ని అందిస్తున్నారు. ఇంకెందరో పండుగ, పర్వదినాల కార్యక్రమాలకు ఎన్నో విధాల సహాయ సహకారాల నందిస్తున్నారు. వారిలో మీరు ఒకరు. అంతా సేవా భావమే. అదే మాస్టారుగారు నేర్చుకోమన్నది, బాబాగారికి నచ్చేదీ. వారంతా మనకందుకే సంపూర్ణ ప్రేమతో ఆశీస్సులందిస్తున్నారు.

ఓం శ్రీ సాయినాధాయనమః



మాష్టరుగారు అనేకసార్లు దర్శించిన గూడలికొండ

## మాష్టరుగారి "అభయం"

మీకు కావలసిన దంటూ జీవితాల్ని సార్థకం చేసుకొనుటకు అవసరమయినది ఏదైనా వుంటే దానిని ఇందులో ఇప్పుడే వ్రాసాను. నేను వున్నా, లేకున్నా, ఎక్కడున్నా, మీరు నాదగ్గరున్నా, లేకున్నా, నాతో పని లేకుండా మీకు సులభపద్ధతిలో అర్థమగునట్లు నేను చెప్పవలసింది, చెప్పేది, చెప్పబోయేది అంటూ ఏనాటికైనా, ఏమైనా వుంటే అది వ్రాసాను. ఇంతకన్నా చెప్పవలసింది తెలుసుకోవలసింది లేదు. పట్టుకోడమా విడిచిపెట్టడమా అనేది మీలో వున్నది. చివరగా ఏనాటికైనా ముందు ముందు చెప్పబోయేది ఇదే. ఇంతకన్నా ఇక కొంచెముకూడా చెప్పేది ఎక్కువగా దీనిని మించి వుండదు. అసలు ఇంత వరకూ ఇంత సులభంగా జీవితాన్ని సార్థకం చేసికొనుటకు ముక్తి సాధించుటకు ఇంత సులభంగా చెప్పబడలేదు. "ఏది నిజం? నిజానికి నిచ్చెనలు" లోని సారాంశమంతా ఇందులో వచ్చింది. దీనిని పదే పదే భావన చేసుకుంటూ పట్టుబట్టి కూర్చోన్నారంటే చాలు. ఈసారే, ఇపుడే, ఈజన్మ లోనే ముమ్మాటికి ముక్తిని పొందుతారనిరి. "మీరున్నచోట అపవిత్రంగా వున్న, ఆ చోటును నా తపస్సుచేత క్షాళనం చేస్తాను అని చెప్పారు. ఒక్కనెల కూర్చొన్నారంటే దానంతటదే తెలుస్తుంది. శరీరానికి అవసరమయ్యే అవసరాలు వాటంతటవే తీరిపోతాయి. ఇక్కడ ఇక చర్యలకు వీలులేదు. వాటికి స్థానముండదు. కూర్చోటమా? కూర్చోకపోవటమా! ధ్యానానికి అన్నది మాత్రమే ఇపుడుండేది. ఎవరికి తగినట్లు వారు అవకాశం చూసుకొని వచ్చి కూర్చొంటే చాలు! దానంతటదే సాగిపోతుంది, అని ఇపుడు చదివేది జాగ్రత్తగా వినండి" అని శ్రీమాష్టార్ అప్పటికప్పుడు వ్రాసిన "ధ్యానం" విషయాన్ని ఇలా చదివి విన్పించారు.

"అన్ని రూపాలు, అన్ని భూతాల రూపంలో గోచరించేది ఒకే ఒక విశ్వచైతన్యం" అదే మనంగా మన కనుభవమౌతూ అదే అంతటా అన్ని రూపాలలో ఊహాలోకం లోని వస్తు సమదాయంలోని పదార్థాల్లాగా - రూపమున్నట్లు గోచరిస్తుంది. తానే అవన్నీ అన్న విషయాన్ని విస్మరించడంచేత ఆ చైతన్యమే ఆ పదార్థములతో చేయబడ్డ ఒక పరిమిత దేహమనే మనస్సనే తనను తాను భావించుకొని, అన్యముగా జగత్తులోని వస్తుపదార్థప్రాణి వ్యక్తులను చూస్తుంది. పిల్లవాని మనస్సులోని భయమే భూతం రూపాన్ని ధరించి వాడికి



వాస్తవమన్పించినట్లు తాను పరిమితమన్న భ్రాంతి వస్తుపదార్థాది రూపాలతో వాస్తవంగా గోచరిస్తుంది.

ఆ పరిమితి నుండి విడివడడమే ముక్తి. దానికి ఇది యుక్తి, కళ్ళు మూసుకుని తన ఇంద్రియ నిర్మాణం చేతనే జగత్తు, ఇప్పుడు ఇట్లా గోచరిస్తూందని లోతుగా జ్ఞప్తి చేసుకోవాలి.

ఆ వస్తు పదార్థాది రూపాలలో తనదేహం ఒకటిగా వున్నట్లు, మెలకువ అనే మానసిక స్థితిలో వాస్తవ మనిపిస్తుందని కనుక నిద్రావస్థ యందుండదనీ లోతుగా జ్ఞాపకం చేసుకోవాలి. తాను కేవలం నిరాకార చైతన్యమని తెలియని తనమే మనోదేహాదులు.

తర్వాత అంతటా వ్యాపించియున్న పరమేశ్వరు డను విశ్వచైతన్యమే దాని యొక్క భావనయే (సంస్కారమే) ఇది అని మన మనోదేహాదుల యథార్థతత్వాన్ని దర్శించాలి. ఈ భావన ఎంతగా చేయాలంటే 'ఇది దేహము, ఇది నేను" అన్న భావము అంతరించునంతటి తీవ్రతతో చేస్తే అంతటా విశ్వ చైతన్యమే అనుభవమవుతుంది. పూర్వ వాసనవల్ల మళ్ళీ మళ్లీ చుట్టూ జగత్తూ, తన దేహమూ మనస్సుకు, గోచరించి, ఆ దేహము తానన్న భావం తలెత్తుతుంది. తిరిగి పైన చెప్పిన విధంగా ఆ భావాలను మళ్ళీ మళ్ళీ నిలబెట్టడమే తపోనిష్ఠ, అంటే ఈ విధంగా తానే ఆ విశ్వచైతన్యంగా నిరంతరం గుర్తించుకోవటమే అజపాజపం. ఇదే గాయత్రీ మంత్రార్థము. ఇదే ఆత్మరతి. జ్ఞాన నేత్రముతో కాముణ్ణి నశింపజేయడమంటే ఇదే.

"నేనే దేహం" అన్న భావం విల్లును వీడిన బాణం లాగా మనస్సును వీడి అంతా విశ్వచైతన్య మన్న భావాన్ని లక్ష్యంగా చేసుకొని అందులో లయించడమే ధనుర్వేదసారం. "ఈ జగత్తంతా నిజంగా వాసనా రూపం, వాసనా రాహిత్యం ద్వారా నిష్ప్రపంచుడు కావడమే లక్ష్యం" అని యోగవాశిష్టము కూడా చెప్తుంది.

"ఇది జగత్తు, ఇది దేహము" అను వాసనలు ఏ చైతన్యమందు ఉదయిస్తున్నాయో దాని యందే ఆ భావాలను తరంగాలుగా భావించి లయింపజేయాలి. గుడ్డలోని మడతను సరిదిద్దినట్లు తద్వారా మళ్ళీ మళ్ళీ విశ్వచైతన్యుడైన పరమేశ్వరుని యందు లయింపచేయాలి. అంతటా విశ్వ

చైతన్యమొక్కటే గోచరిస్తున్నప్పుడల్లా తానే చైతన్య రూపుడయిన పరమాత్మ అవుతాడు. సహనము, ఓర్పు, పట్టుదలతో తిరిగి తిరిగి ఇట్లా ధ్యానిస్తుంటే అది స్థిరపడుతుంది. అదే తన రూపమని తెలుస్తుంది. భ్రాంతి ఇక రాదు. అదే ముక్తి అంటే. ఆ చైతన్యుడికి ఏ పేరు పెట్టక అదే పరమేశ్వరుడన్న భావం కలిగి ఉండడము శ్రేయస్కరం.

ఇది ఆ విశ్వచైతన్యుడైన పరమేశ్వరుడే అన్న భావంతో, ఇది నా దేహము, నా మనస్సనే భావాలను నశింపజేయడమే 'అంగన్యాస, కరన్యాసము లని మంత్రశాస్త్రం చెబుతుంది. శరీరములోని వివిధ తత్త్వముల యెడగల మన అజ్ఞాన భావాలను ఈ విధంగా తొలగించి వాటి నన్నింటిని ఈ విశ్వచైతన్యంగా దర్శించడమే సాంఖ్యయోగము. నిరంతరము మనస్సును ఈ సాధనయందే తెంపు లేకుండా నిమగ్న మొనర్చడమే సాధన.

అపరిమితమైన విశ్వ చైతన్యంలో తాను పరిమితుడనన్న భ్రాంతిలో చిక్కడం వల్ల మానవునకు అశాంతి, దుఃఖము కలుగుతున్నాయి. తిరిగి ఆ పరిమితి తొలగి పోవడంతోటే శాంతి ఆనందాలు తనకు సహజమౌతాయి. సరైన ఈ మార్గాన్ని విడిచి ఇతర మార్గాల ద్వారా శాంతి ఆనందాలన్వేషించడమే సంసారం. ఇది కేవలం దుఃఖప్రదం.

ఇదే నిజమైన ధ్యానం, ధ్యాన శ్లోకార్థం. దీనిని ధ్యానిస్తూ పూజ చేయాలి. పూజ జరిగేటంత సేపు నిజంగా, సద్గురువు మన ముందు ఆకారంలోనూ, సర్వత్రా, మనలోనూ కేవల చైతన్యంగా వుంటారన్న గుర్తును నిలుపుకుని ప్రేమతో, భక్తి గౌరవాలతో "16" సేవలనూ చేయాలి. పూజానంతరం ఆ గురుమూర్తి మన హృదయంలోకి వెళ్ళినట్లు భావించాలి. పూజానంతరం వీలయినంతసేపు పూజ యొక్క ప్రభావాన్ని మనస్సులో నిలవనివ్వాలి – అన్నారు (మాష్టరు వ్రాసిన ఒరిజనల్ కాపీ నాదగ్గరున్నది.)

– (మహాత్ముల ముద్దుబిడ్డడు సౌజన్యంతో)

